# సాహితీ కౌముది



ISO 9001-2008 Certified Institution

Re-Accredited by NAAC with 'A' Grade
NIRF - 92nd rank (All India)


## KAKARAPARTI BHAVANARAYANA COLLEGE
(Autonomous)

Estd. 1965

**A college with potential for Excellence (CPE-UGC)**

**(Sponsored by : S.K.P.V.V. Hindu High Schools Committee) Kothapet, VIJAYAWADA-1**

**Website : www.kbncollege.info, www.kbncollege.ac.in**

**E-mail : info@kbncollege.ac.in**


తెలుగు విభాగం 2017, డిసెంబరు 16వ తేదిన నిర్వహించిన
జాతీయ సదస్సులో సమర్పించిన పరిశోధనా పత్రాల సంకలనం

# సాహితీ కౌముది

(గోష్ఠిపత్రాల సంకలనం)

# Sahitee Koumudi

(A compilation of research papers)

**ISBN : 978–81–929554–4-5**

Copy rights reserved with publisher

**First Edition :** December, 2017

**Copies:** 120

**Publisher**
Dr V.Narayana Rao,
Principal, K.B.N College, Vijayawada

**Layout & title**
Venkat Gaddala

**Printer**
Sri Surya Graphics,
Gandhinagar, Vijayawada

**For Copies**
Dr J.V.Chalapathi Rao,
Head, Department of Telugu,
K.B.N College, Vijayawada

## లోపలి పేజీల్లో...

1. శేషేంద్ర కవితా ప్రస్థానం
- ఆచార్య గోగినేని యోగప్రభావతీ దేవి ........ 16
2. సామాజిక వచన కవిత్వానికి కవిరాజు 'సరికొండ నరసింహరాజు'
- ఆచార్య కె.సత్యనారాయణ ........ 18
3. హృదయాలను స్పందింపజేసే 'మైనపు బొమ్మలు'
- డా. ఇరపని మాధవి ........ 20
4. గూటూరి కవితా స్పందన
- ఆచార్య మన్నవ సత్యనారాయణ ........ 22
5. కవిత్వ రీతిపై కాళోజీ 'ఈప్స'
- డా॥ ఎన్.వి. కృష్ణారావు ........ 24
6. ఛందో బంధనాలను ఛేదించిన వచనకవిత
- డాక్టర్. రెంటపల్లి. రవీంద్రభాస్ ........ 26
7. వచనా కవితా ప్రపంచం-అబ్బూరి ఛాయాదేవి
- డా॥ పి. ఉష ........ 28
8. ఎండ్లూరి 'గోసంగి' దీర్ఘకావ్యం- దళిత వచన కవిత్వంలో మైలురాయి
- డా. కె. సురేశ్ కుమార్, మరియు డా. సి. హెచ్. కిషోర్ ........ 30
9. ముస్లిం మైనారిటి వచన కవిత్వం-పర్యావరణం-దేశభక్తి
- షేక్.ఖాదర్ మస్తాన్ ........ 32
10. తెలుగు వచన కవిత్వాన నూతన ప్రక్రియలు
- మెంటే రాణిరత్నకుమారి ........ 34
11. వచన కవిత - సమకాలీనత
- డాక్టర్ డి.ఆర్.శర్మ మరియు డాక్టర్ కె.రామకృష్ణ ........ 36
12. శేషేంద్ర దృష్టిలో సామాజిక సృష్టి
- డా. జాడ సీతాపతి రావు ........ 28
13. తిలక్ 'అమృతం కురిసిన రాత్రి'-సామాజికత
- డా. పి.వి.లక్ష్మణరావు ........ 40
14. తెలుగులో సామయిక కవిత్వం
- డా.టి.జాన్ కిరణ్ బాబు ........ 42
15. వచన కవిత్వంలో స్త్రీ చైతన్యం
- డా. వెంకటేశన్ పూజారి ........ 44
16. అధివాస్తవిక కవిత్వం
డా. కె.వి.శాంత కుమారి ........ 46
17. ఆధునిక తెలుగు సాహిత్యాన వచన కవితా వికాసము
- పి. కుసుమ్ కామేశ్వరి ........ 48



ISBN : 978-81-929554-4-5

# ఎండ్లూరి 'గోసంగి' దీర్ఘకావ్యం
## - దళిత వచన కవిత్వంలో మైలురాయి

డా. కె. సురేశ్ కుమార్, తెలుగు అధ్యాపకులు, టి.ఆర్.ఆర్. ప్రభుత్వ కళాశాల, కందుకూరు
మరియు
డా. సి.హెచ్. కిషోర్, తెలుగు అధ్యాపకులు, కె.వి.ఆర్. కళాశాల, నందిగామ

సంప్రదాయ సాహిత్యం మీద తిరుగుబాటుగా వచ్చిన నవ్య సంప్రదాయ సాహిత్యంతో మొదలుపెడితే కాల్పనిక, అభ్యుదయ దిగంబర, విప్లవ, దళిత, స్త్రీ వాద, చేతనావర్త, కవిసేన కవులకు, వాదాలకి, ఉద్యమాలకి కవిత్వమే ప్రధాన వాహికైంది. అది వచన కవిత్వమే అనేది ప్రత్యేకించి చెప్పాల్సిన పనిలేదు.

ఎందరో 'వచన కవిత్వం' రాయడం ద్వారా ప్రసిద్ధులయ్యారు. శ్రీశ్రీ, నారాయణబాబు, ఆరుద్ర, సోమసుందర్, పురిపండా, అబ్బూరి, పఠాభి, తిలక్, కృష్ణశాస్త్రి మొదలుకొని నేడు కవిత్వం రాస్తున్న ఎందరో ఈ వచన కవిత్వాన్ని ఎన్నుకోవడం ద్వారా వారు చెప్పదలచుకున్న భావాన్ని బలంగా వినిపించ గలుగుతున్నారనవచ్చు. ఈ వచన కవిత్వమే మినీ కవిత్వమని, ఇంకా రకరకాల పేర్లలో వర్ధిల్లుతోంది.

ఇటువంటి వచన కవితా ప్రక్రియలో ఎండ్లూరి సుధాకర్ 2010లో గోసంగి' దీర్ఘకావ్యాన్ని రచించారు. సాహిత్య పిపాసి, దళితద్రష్ట, మానవతావాది, కలం పట్టిన యోధుడు సుధాకర్ ఎండ్లూరి.

శ్రీకృష్ణదేవరాయల 500వ పట్టాభిషేక సందర్భంగా ఎండ్లూరి ఎంచుకున్న అంశం 'గోసంగి' రాయలు రచించిన ఆముక్తమాల్యదలో ఈ 'గోసంగి' ప్రస్తావన ఉంది. ఇన్ని సంవత్సరాలుగా ఎందరో పండితులు పట్టించుకోని పలు అంశాలను మేళవించి 'గోసంగి' కావ్యాన్ని ఎన్నో కొత్త ప్రశ్నలతో ముందుకు తెచ్చారు. అవి చరిత్రని, సాహిత్య చరిత్రని, కావ్య వాఖ్యానాలని, వాటిని రాసిన పండితుల పాండిత్యాన్ని తూర్పార బట్టింది. బిత్తరపోయేలా చేసింది.

కథలోకి వెళితే ఆంధ్రదేశంలో మాదిగలనే 'గోసంగి' పేరుతో పిలవడం ఉంది. రాయలవారు తన కావ్యంలో 'గోసంగి' అని స్పష్టంగా పలుకుతాడు. 'మహాత్మా' అని అతన్ని పిలుస్తాడు. ఈ అంశాన్ని ఎండ్లూరి కవి కదిలించారు. ఎండ్లూరి మాటల్లోనే చెప్పాలంటే "అంగుళమంత వాక్యాన్ని తన వ్యాఖ్యానంలో వేదం వారు గుర్తించలేదు. మహాత్ముని పక్కన పెట్టేశారు. ఏ చర్చకూ తావియ్యలేదు. ఒక్క వేదం వారే కాదు ఇప్పటిదాకా 'ఆముక్త మాల్యద' ప్రబంధం మీద ఎవరు వ్యాసం రాసినా, ఉపన్యాసం చేసినా 'మహాత్మ' అంశాన్ని కనీసం ప్రస్తావించరు. ఈ మధ్యకాలంలో వచ్చిన ఆచార్య తుమ్మపూడి కోటేశ్వరరావు గారి 'ఆముక్త మాల్యద' వ్యాఖ్యానంలో కూడా ఇదే జరిగింది. ఇకపై చరిత్రలో ఇలా జరగకూడదనే ఇంగిత జ్ఞానమే ఈ దీర్ఘకావ్యం పుట్టడానికి కారణం" అంటారు.

'గోసంగి కావ్యంలో ఎండ్లూరి లేవనెత్తిన అంశాలు స్థూలంగా పరిచయం చేస్తాను. రాయల యుగం స్వర్ణయుగం కాదు వర్ణయుగమంటాడు.

" మా చరిత్రను మింగేసిన చరిత్ర
మా ఉనికిని ఉరితీసిన చరిత్ర
అది స్వర్ణయుగం కాదు


ISBN : 978-81-929554-4-5

....
ఎవరన్నారు / రాయల వారిది స్వర్ణయుగమని
వివర్ణయుగమే తెలుసుమాకు
వివక్ష యుగమే అనుభవం మాకు" .... అంటూ

దళితుల స్థానం, సామాజిక, రాజకీయ, ఆర్థిక, మత, సాంస్కృతిక, భాషా రంగాల్లో ఏ మాత్రం మెరుగ్గా లేదంటాడు. అది స్వర్ణయుగమెలా అవుతుంది అని చరిత్రని ప్రశ్నిస్తాడు. అదే సమయంలో ఎన్నో ఆరోపణలు చేసినా రాయలు, గోసంగి'ని గుర్తించినందుకు, 'మహాత్మా' అని సంబోధించినందుకు ఎంతో గౌరవం చూపుతాడు.

ప్రాచీన కావ్యాలకు వాఖ్యానాలు రాసిన ఆధునిక పండిత వర్గం గురించి
"నేనూ మాణిక్యాన్నే / కానీ మసిగుడ్డలో దాచబడ్డాను
నేనూ సాటి మనిషినే / కాని అంటరాని గడ్డలో పుట్టాను
విహ్వల విషాద / వివర్ణ యుగంలో విధి వంచితుణ్ణి
వేదం గుర్తించని మహాత్ముణ్ణి" అంటారు

రాయలు ఆముక్త మాల్యదతో గోసంగి కులాన్ని గుర్తించాడు. వారి కళని గౌరవించాడు 'మహాత్మా' అని పిలిచాడు. రాయలవారు గుర్తించగా లేనిది మరి వాఖ్యానం చేసిన వేదం వారు ఆ ఊసే మరచారు. పైగా గోసంగిని 'మాలదాసరి' చేశారు. ఇలా పండితులకి "వేదపరిజ్ఞానమేగాని / వాడపరిజ్ఞానం లేదు" అని స్పష్టంగా ఎత్తిచూపుతాడు. అట్లా అని పండిత కులాన్ని అంతాకాదు. అన్నమయ్యని బ్రహ్మానాయని మొ॥ వారిని గౌరవిస్తాడు.

ఏ కులానికి ఆ కులం ప్రత్యేక అస్తిత్వం, సంస్కృతి ఉండగా వాటిని ఎందుకు గుర్తించరు ? ఒకటైతే దళిత కులాలన్నింటిని ఒకగాటన కట్టి ఒక్క కులాన్నే అంటరాని వారికి ప్రతినిధిగా చేసినపుడు (అగ్రవర్ణాలవారు) మిగతావారు / తెలిసిన వారు ఎందుకు మౌనంగా ఉంటున్నారనేది మరో ప్రశ్న. ఈ ప్రశ్నలు కులవ్యవస్థని సమర్ధించటం కాదు ఎవరి గౌరవం వారికే దక్కాలనే మానవీయకోణమే.

మనిషిని మనిషిగా గౌరవించే సంస్కృతి పెంపొందాలి అంటాడు. అందుకే కృష్ణరాయా / నిన్నిప్పుడు ప్రశ్నవేయ / సముచితమో కాదో గాని అంటూ ఓ వైష్ణవ చక్రవర్తీ / ఇదీ పదహారో శతాబ్దపు అస్పృశ్యుల దుస్థితి సర్వం విష్ణుమయం జగత్కాదు / సర్వం విషమయం జగత్ ... అని ఎంతకాలమిలా అనే ప్రశ్నని సమాజం ముందుంచుతాడు.

ఈ 'గోసంగి'లో ఎన్నో విషయాలని పండితులు, చరిత్రకారులు, సామాన్య పాఠక జనం అర్థం చేసుకునేలా వచన కవితా ప్రక్రియలో వ్యక్తం చేశాడు. చరిత్ర నుంచి పాఠాలు నేర్చుకుని వర్తమానాన్ని సరిచేసుకోవాలంటాడు. పదాల కూర్పులో, ప్రతీకల వాడకంలో వందల సంవత్సరాల చరిత్రని కుదించుకుని, సమన్వయం చేసుకుని చెప్పటానికి ప్రతిభకావాలి, అభివ్యక్తి కావాలి ఇవి పుష్కలంగా ఉన్న కవి ఎండ్లూరి.


ISBN : 978-81-929554-4-5